క్లుప్తంగా

నకరికల్లు ఎస్ఐగా బాలకృష్ణ



నకరికల్లు: స్థానిక ఎస్ఐగా ఏ.బాలకృష్ణ శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. గత 21నెలలుగా ఇక్కడ పనిచేస్తున్న ఎస్ఐ పి.సురేష్ బదిలీపై యడ్లపాడుకు వెళ్లారు. ఆ స్థానంలో సత్తెనపల్లి రూరల్ ఎస్ఐగా పనిచేస్తున్న బాలకృష్ణ బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అసాంఘిక కార్యకలాపాల్ని అరికట్టి, నేరాల శాతం తగ్గించేందుకు కృషి చేస్తానని చెప్పారు. ట్రాఫిక్ సమస్య, రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రత్యేక చర్యలు తీసుకుంటానని తెలిపారు. ఈ సందర్భంగా సిబ్బంది ఆయన్ను ఘనంగా సన్మానించారు.

నేడు జాషువా జీవితం, సాహిత్యంపై వ్యాస రచన పోటీలు

సత్తెనపల్లి: విశ్వనరుడు గుర్రం జాషువా 52వ వర్ధంతి సందర్భంగా పట్టణంలోని కవి కోకిల గుర్రం జాషువా సాహితీ సేవా సంస్థ ఆధ్వర్యంలో పల్నాడు జిల్లా స్థాయిలో ఈ సంవత్సరం 9,10వ తరగతి చదువుతున్న విద్యార్థులకు గుర్రం జాషువా జీవితం -సాహిత్యం అనే అంశంపై శనివారం వ్యాసరచన పోటీల్ని నిర్వహిస్తున్నట్లు సంస్థ అధ్యక్ష, కార్యదర్శులు ఇర్మియా, సురేష్‌బాబు తెలిపారు. పట్టణంలోని మెయిన్ రోడ్డులో గల ప్రగతి ఇంగ్లిష్ మీడియం స్కూల్లో మధ్యాహ్నం 2.30 నుంచి 3.30గంటల వరకు పోటీలు నిర్వహించనున్నట్లు వారు పేర్కొన్నారు. ఎలాంటి ప్రవేశ రుసుం లేదన్నారు. ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులతో పాటు ఐదు కన్సోలేషన్ బహుమతులు అందిస్తామని పేర్కొన్నారు. పోటీల్లో పాల్గొన్న ప్రతి ఒక్కరికీ పార్టిసిపేట్ సర్టిఫికెట్ ఇస్తామని తెలిపారు. ఇతర వివరాలకు 9676512673, 7780485309 నంబర్లలో సంప్రదించాలని కోరారు.

దివ్యాంగురాలికి ట్రై సైకిల్ పంపిణీ



సత్తెనపల్లి: ఆపదలో ఉన్నవారికి సహాయం అందించడంలో ముందుండే హరి మిత్రమండలి ఔదార్యాన్ని చాటుకుంది. పట్టణంలోని ఆరో వార్డుకు చెందిన దివ్యాంగురాలు ఉప్పుతోళ్ల అంజమ్మ ట్రై సైకిల్ లేక ఇబ్బందులు పడుతుండడంతో ఆమెకు శుక్రవారం పంపిణీ చేసింది. కార్యక్రమంలో హరి మిత్ర మండలి అధ్యక్షుడు సదనం హరి, సభ్యులు తోట స్వామి, సంపత్, అజయ్ రెడ్డి, చంటి, నరేష్, ప్రభాకర్ ,వెంకట్ పాల్గొన్నారు.

ఉత్తమ సేవలందించిన ముగ్గురు ఉద్యోగులకు సత్కారం



సత్తెనపల్లి: ప్రజలకు ఉత్తమ సేవలు అందించిన శానిటరీ అండ్ ఎన్విరాన్మెంట్ సెక్రటరీ కోటగిరి లక్ష్మీ ప్రసన్న, 17,18 వార్డుల్లో ప్రజలకు ఉత్తమ సేవలు అందించిన వలంటీర్లు గొల్లపూడి వరలక్ష్మి, శానంపూడి గోవర్ధినిలను పూలమాలలు, దుశ్శాలువాలతో శుక్రవారం సత్కరించారు. వారి సేవల్ని చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు చల్లంచర్ల సాంబశివరావు, మున్సిపల్ కమిషనర్ కొలిమి షమ్మి, కౌన్సిలర్లు కొనియాడారు. కార్యక్రమంలో మేనేజర్ పేరం సాంబశివరావు, కౌన్సిలర్లు, మున్సిపల్ అధికారులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో జలాభిషేకాలు



రాజుపాలెం: మండలంలోని రెడ్డిగూడెంలో జలాభిషేకాలతో శుక్రవారం పండుగ వాతావరణం నెలకొంది. గ్రామంలో ఇటీవల నూతనంగా గంగమ్మ తల్లి దేవాలయ నిర్మాణం, విగ్రహ ప్రతిష్ట, బొడ్డురాయి పునః ప్రతిష్ట, పాటిపాటమ్మ తల్లి, మహాలక్ష్మీ తల్లి దేవాలయాలు, విగ్రహ ప్రతిష్టలను నిర్వహించారు. శ్రావణ మాసం ప్రారంభ దశలో శుక్రవారం రావడంతో మహిళలు భారీగా తలపై జలబిందెలతో తరలివచ్చి అమ్మవార్ల విగ్రహాలకు అభిషేకాలు నిర్వహించారు. వీరతాళ్లు, కొమ్ములవారి భారీ మేళతాళాలతో నృత్యాలు చేసుకుంటూ గ్రామమంతా పెద్దఎత్తున జాతర నిర్వహించారు.

నేడు ముప్పాళ్ల మండల పరిషత్ సర్వసభ్య సమావేశం

ముప్పాళ్ల : స్థానిక మండల పరిషత్ సర్వసభ్య సమావేశాన్ని శనివారం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో పి.పుట్టారెడ్డి తెలిపారు. మండల పరిషత్ కార్యాలయంలో మధ్యాహ్నం 3గంటలకు జరిగే ఈ సమావేశానికి ఆయా గ్రామాల సర్పంచులు, గౌరవ సభ్యులు హాజరుకావాలని కోరారు.అధికారులు కూడా తమ శాఖలకు సంబంధించిన పూర్తి వివరాలతో హాజరు కావాలని ఆయన సూచించారు.

ప్రజా సంక్షేమమే ధ్యేయంగా జగనన్న పాలన

చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు చల్లంచర్ల సాంబశివరావు



సర్టిఫికెట్లు పంపిణీ చేస్తున్న చల్లంచర్ల, పక్కన నాయకులు

సత్తెనపల్లి: రాష్ట్ర ప్రజల సంక్షేమమే ధ్యేయంగా ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్‌మోహన్‌రెడ్డి పాలన సాగిస్తున్నారని చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు చల్లంచర్ల సాంబశివరావు అన్నారు. పట్టణంలోని 12వ సచివాలయ పరిధిలోని 17, 18 వార్డులకు సంబంధించి శుక్రవారం నిర్వహించిన జగనన్న సురక్ష కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. దేశ చరిత్రలో ఏ ప్రభుత్వం అందించని విధంగా వైఎస్సార్ సీపీ ప్రభుత్వం సంక్షేమ పథకాల్ని అమలు చేస్తోందన్నారు. గతంలో ఏ సర్టిఫికెట్ పొందాలన్నా ప్రజలు రోజుల తరబడి సంబంధిత ప్రభుత్వ కార్యాలయాలు చుట్టూ తిరగాల్సి వచ్చేదని, ప్రస్తుతం జగనన్న సురక్ష కార్యక్రమం ద్వారా అవసరమైన అన్ని సర్టిఫికెట్లను ఉచితంగా ఇంటి ముంగిటే అందజేస్తున్నారని వివరించారు. దళారుల ప్రమేయం లేకుండా సంక్షేమ పథకాల లబ్ధిని నేరుగా లబ్ధిదారుల ఖాతాల్లో జమ చేస్తూ, ప్రతి ఇంటికీ సంక్షేమ ఫలాలు అందిస్తున్న ఘనత సీఎం జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందని కొనియాడారు. ఈ సందర్భంగా 454 మందికి వివిధ రకాల సర్టిఫికెట్లు, 12 మందికి రేషన్ కార్డులు మంజూరు చేశారు. మున్సిపల్ కమిషనర్ కొలిమి షమ్మి మాట్లాడుతూ అర్హులై ఉండి సంక్షేమ పథకాలు రాని వారిని గుర్తించి అందించడమే లక్ష్యంగా ప్రభుత్వం జగనన్న సురక్ష కార్యక్రమాన్ని చేపట్టిందని వివరించారు. కార్యక్రమంలో మున్సిపల్ మేనేజర్ పేరం సాంబశివరావు, 17,18 వార్డుల కౌన్సిలర్లు సెగ్గెం పద్మావతి, తోట సుధారాణి, నాయకులు సెగ్గెం వెంకటేశ్వరరావు, తోట వెంకటేశ్వర్లు, ఆకుల రమేష్, శెట్టి ఆనంద్, పెద్దింటి వెంకటేశ్వర్లు , కాకుమాను రవికుమార్, తుమ్మల వెంకటేశ్వరరావు, సిరిగిరి వెంకట్రావు, బండి మల్లికార్జునరెడ్డి, ఆకుల హనుమంతరావు, సంకుల తిరుమలరావు పాల్గొన్నారు.

నకరికల్లులో...

అర్హత ఉంటే చాలు ప్రభుత్వ పథకాలు అందించేందుకు అధికారులు, ప్రజాప్రతినిధులు సిద్ధంగా ఉన్నారని వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ భవనం రాఘవరెడ్డి అన్నారు. మండలంలోని చేజర్లలో జగనన్న సురక్ష కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. నూరు శాతం రాయితీపై రైతులకు కందివిత్తనాలు పంపిణీ చేశారు. పలు పథకాలకు అర్హులైన వారికి మంజూరు పత్రాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా రాఘవరెడ్డి మాట్లాడుతూ జగనన్న ప్రభుత్వం ప్రజల ప్రభుత్వమని కొనియాడారు. కార్యక్రమంలో సర్పంచ్ బొడ్లపాటి కృష్ణకుమారి, తహసీల్దార్ కె.నగేష్, ఎంపీడీఓ బండి శ్రీనివాసరెడ్డి, ఏఓ కె.దేవదాసు, ఈఓపీఆర్డీ గిరిధర్, ఎంపీటీసీ సభ్యుడు సభ్యుడు బొడ్లపాటి వెంకటరెడ్డి, పంచాయతీరాజ్ ఏఈ కె.సురేష్, ఏపీఓ రామకృష్ణ, గ్రామ కార్యదర్శి మమత, భాస్కర్‌రెడ్డి, పలుశాఖల సిబ్బంది, గ్రామపెద్దలు పాల్గొన్నారు.



చేజర్లలో రైతులకు విత్తనాలు పంపిణీ చేస్తున్న మండల కన్వీనర్ రాఘవరెడ్డి, అధికారులు



నాగవరంలో సర్టిఫికెట్ అందజేస్తున్న తహసీల్దార్ జియావుల్‌హక్, అధికారులు

క్రోసూరులో..

జగనన్న సురక్ష శిబిరాల్లో ప్రజలు దరఖాస్తు చేసుకున్న ప్రతి అర్జీని పరిశీలించి అక్కడే ధ్రువీకరణ పత్రాలు అందజేస్తున్నామని నాగవరం నోడల్ అధికారి , తహసీల్దార్ ఎండీ. జియావుల్‌హక్ అన్నారు. మండలంలోని నాగవరం, హసనాబాద్ గ్రామాల్లో జగనన్న సురక్ష శిబిరాల్ని శుక్రవారం నిర్వహించారు. హసనాబాద్ జగనన్న సురక్ష శిబిరానికి ఎంపీడీవో బి.మహేష్ నోడల్ అధికారిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ సర్టిఫికెట్ల కోసం ప్రజలు ఇబ్బంది పడకుండా సీఎం జగన్ ఈ కార్యక్రమాన్ని చేపట్టినట్లు వివరించారు. నాగవరంలో 360, హసనాబాద్‌లో 305 సర్టిఫికెట్లు అందజేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీపీ పి.కోటయ్య, జెడ్పీటీసీ షేక్ జమీలా గఫూర్, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ వెలది అప్పారావు, నాగవరం సర్పంచ్ పద్మావతి, క్రోసూరు వైఎస్సార్ సీపీ నాయకులు అనుముల కోటిరెడ్డి, గార్లపాటిదాసు, తిప్పిరెడ్డి అప్పిరెడ్డి, నాగవరం నాయకులు, మాజీ సర్పంచ్ దేవదానం,షేక్ సుభాని, పార్టీ గ్రామ కన్వీనర్ అంకమరావు, హసానాబాద్ గ్రామ సర్పంచ్ షేక్ రహీం, పార్టీ నాయకులు ముస్తఫా, పార్టీ గ్రామ అధ్యక్షుడు రెడ్డిగూడెం మస్తాన్‌వలి, గారపాటి ఖాజా, గుదె వెంకటేశ్వర్లు, శ్రీరాంసెట్టి చిన్నబ్బాయి, శ్రీరాంసెట్టి వెంకాయమ్మ , ఆయా గ్రామాల సచివాలయ సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.



అత్తలూరులో ధ్రువీకరణ పత్రాలు అందిస్తున్న అధికారులు

అమరావతిలో...

మండల పరిధిలోని అత్తలూరులో శుక్రవారం నిర్వహించిన జగనన్న సురక్ష కార్యక్రమానికి ఈవోపీఆర్డీ ప్రసాద్‌బాబు అధ్యక్షత వహించారు. జగ్గయ్యపేట నియోజకవర్గ వైఎస్సార్ సీపీ పరిశీలకుడు నూతలపాటి హనుమయ్య, గ్రామ సర్పంచ్ బంకా సరోజిని చేతుల మీదుగా 220 మందికి ధ్రువీకరణ పత్రాలు అందించారు. కార్యక్రమంలో తహసీల్దార్ విజయశ్రీ , ఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

సీసీ కెమెరా నిఘాలో నకరికల్లు

- ఒకేసారి 30 కెమెరాలను ప్రారంభించిన డీఎస్పీ బి.ఆదినారాయణ
- రూ. 4లక్షలతో ప్రధాన కూడళ్లలో ఏర్పాటు



కెమెరాలను ప్రారంభిస్తున్న డీఎస్పీ ఆదినారాయణ

నకరికల్లు: ఒక్క సీసీ కెమెరా పదిమంది కానిస్టేబుళ్లు చేసే పనితో సమానమని డీఎస్పీ బి.ఆదినారాయణ పేర్కొన్నారు. నకరికల్లులోని ప్రధాన కూడళ్లలో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాల్ని గురువారం రాత్రి ఆయన ప్రారంభించారు. కెమెరాల కంట్రోల్ రూంను ఎస్ఐ పి.సురేష్ ప్రారంభించారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ ఎస్పీ ఆదేశాల మేరకు సత్తెనపల్లి డివిజన్ పరిధి పెదకూరపాడు సర్కిల్‌లోని క్రోసూరులో 10 సీసీ కెమెరాలు ఏర్పాటు చేశామని తెలిపారు. డివిజన్‌లోని అన్ని పోలీస్‌స్టేషన్ల పరిధిలో ప్రతి కూడలిలోనూ ఏర్పాటుకు సన్నాహాలు చేస్తున్నామని వెల్లడించారు. సీసీ కెమెరాల ద్వారా నేరాల శాతం తగ్గించవచ్చని తెలిపారు. మిస్సింగ్, చోరీ కేసులు నేరస్తులు, ప్రమాదాలకు కారణాల్ని గుర్తించేందుకు కెమెరాల అవసరం ఉందని అభిప్రాయపడ్డారు. నకరికల్లులో రూ. 4లక్షలతో 30 సీసీ కెమెరాలు ఏర్పాటు చేయడంలో ఎస్ఐ పి.సురేష్ ఎంతగానో కృషి చేశారని అభినందించారు. కార్యక్రమంలో రూరల్ సీఐ సీహెచ్.కోటేశ్వరరావు, ఎస్ఐ ఏ.బాలకృష్ణ , ఏఎస్ఐలు ప్రసాద్, కోటేశ్వరరావు, జిలాని, వెంకటేశ్వర్లు, ప్రసాద్, సిబ్బంది పాల్గొన్నారు.

రీ సర్వేకు రైతులు సహకరించాలి

డెప్యూటీ కలెక్టర్ వసంత్‌బాబు



సర్వే వివరాలను అడిగి తెలుసుకుంటున్న వసంత్‌బాబు

పెదకూరపాడు: రీ సర్వేకు రైతులంతా సహకరించాలని డెప్యూటీ కలెక్టర్ వసంత్‌బాబు కోరారు. పెదకూరపాడు తహసీల్దార్ కార్యాలయంలో శుక్రవారం ఆయన రీ సర్వేపై అధికారులతో సమీక్ష నిర్వహించారు. పెదకూరపాడు మండలంలో 13 గ్రామాల్లో జరుగుతున్న రీసర్వేను టీం ఆగస్టు 31లోపు పూర్తి చేయాలని ఆదేశించారు. రైతు పూర్తి అనుమతితోనే సర్వే చేయాలని ఆయన చెప్పారు. కార్యక్రమంలో సత్తెనపల్లి ఆర్డీవో రాజకుమారి, రెవెన్యూ సిబ్బంది పార్థసారథి, వెంకటేశ్వరరావు, విజయ్‌కుమార్, తహసీల్దార్ క్షమారాణి, సర్వే టీం సభ్యులు పాల్గొన్నారు.

పీహెచ్‌సీని తనిఖీ చేసిన కేంద్ర నీతి ఆయోగ్ బృందం



అత్తలూరు పీహెచ్‌సీలో రికార్డులను పరిశీలిస్తున్న కేంద్ర నీతి ఆయోగ్ బృంద సభ్యులు

అమరావతి: మండల పరిధిలోని అత్తలూరు పీహెచ్‌సీని శుక్రవారం ఢిల్లీ నుంచి వచ్చిన కేంద్ర నీతి ఆయోగ్ బృందం సందర్శించింది. కేంద్రంలో రోగులకు, గ్రామాల వారీగా అందించే వివిధ ఆరోగ్య సేవల్ని సభ్యులు సమీక్షించారు. పీహెచ్‌సీలో అందిస్తున్న 64 రకాల వైద్య పరీక్షలు, 165 రకాల మందుల్ని పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఆరోగ్య కేంద్రం కోసం నిర్మిస్తున్న నూతన భవన నిర్మాణాల్ని పరిశీలించారు. అనంతరం మండల పరిధిలోని దిడుగు హెల్త్ సబ్ సెంటర్‌ను సందర్శించారు. అక్కడ గ్రామస్తులకు అందిస్తున్న సేవల్ని అడిగి తెలుసుకున్నారు. గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రంలో పిల్లల ఆరోగ్య స్థితిగతుల్ని పరిశీలించారు. కార్యక్రమంలో పరిశీలక బృందంతో పాటుగా జిల్లా ప్రోగ్రాం కో-ఆర్డినేటర్ నాగపద్మజ, సిబ్బంది బాషా, నీలకంఠేశ్వరరావు, పీహెచ్‌సీ వైద్యాధికారి శివరత్నకుమార్, సీహెచ్‌వో అనందరావు పాల్గొన్నారు.

చిరుధాన్యాల సాగుతో రైతులకు లాభాల పంట

జాయింట్ కలెక్టర్ శ్యామ్ ప్రసాద్



గోళ్లపాడు ఆర్బీకేలో కౌలుకార్డు అందిస్తున్న జాయింట్ కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్

గోళ్లపాడు(ముప్పాళ్ల): రైతులు చిరుధాన్యాల సాగుపై మక్కువ చూపాలని జిల్లా జాయింట్ కలెక్టర్ ఏ.శ్యామ్‌ప్రసాద్ చెప్పారు. జాతీయ ఆహార భద్రత మిషన్‌లో భాగంగా మండలంలోని గోళ్లపాడులో చిరుధాన్యాల సాగు విస్తీర్ణం పెంపుపై శుక్రవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ చిరుధాన్యాలైన రాగి, కొర్రలు, సజ్జలు సాగు వల్ల రైతులకు అనేక ప్రయోజనాలున్నాయని తెలిపారు. తక్కువ వ్యయంతో అధిక లాభాలు పొందేందుకు దోహదపడతాయని చెప్పారు. పప్పు ధాన్యాలకు ఉన్న డిమాండ్‌ను అనుగుణంగా సాగు చేపట్టినట్లయితే రైతులకు గిట్టుబాటు ధర లభిస్తుందని ఆయన సూచించారు. కౌలు రైతులంతా సీసీఆర్సీ కార్డుల్ని తీసుకోవాలని, వీటివల్ల అనేక ప్రయోజనాలు ఉన్నాయని వివరించారు. పల్నాడు జిల్లా వ్యవసాయాధికారి ఐ.మురళి మాట్లాడుతూ కంది పంట విస్తీర్ణం తగ్గడంతో ధరలు పెరిగాయన్నారు. ఈ నేపథ్యంలో అధిక విస్తీర్ణంలో సాగు చేయాలని తెలిపారు. పొలం గట్లపైన సాగు చేసి యాజమాన్య పద్ధతులు పాటించి దిగుబడులు పెంచాలని సూచించారు. కందిలో ఎండు తెగులు నివారణకు ట్రైకోడెర్మాతో విత్తన శుద్ధి చేయాలని సూచించారు. అనంతరం రైతులకు కౌలు కార్డులను, కంది విత్తనాలను అందించారు. కార్యక్రమంలో సర్పంచులు గోపు అప్పమ్మ, చయికం వెంకటప్పారెడ్డి, తహసీల్దార్ ఎం.భవానీశంకర్, ఎంపీడీవో పి.పుట్టారెడ్డి, మండల వ్యవసాయాధికారి ఎం.అరుణ, అధికారులు పాల్గొన్నారు.

పాడి రైతులకు పీఎం కిసాన్ కార్డు ద్వారా రుణ సదుపాయం

పాడి రైతులంతా పీఎం కిసాన్ క్రెడిట్ కార్డు ద్వారా పశువుల పెంపకానికి అవసరమైన రుణం తక్కువ వడ్డీకి పొందవచ్చని, సంవత్సరంలోపు తిరిగి చెల్లించినట్లయితే వడ్డీ రాయితీ కూడా పొందవచ్చని జాయింట్ కలెక్టర్ శ్యామ్ ప్రసాద్ తెలిపారు. గోళ్లపాడులో జగనన్న పాలవెల్లువ నమోదు ప్రక్రియను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పాలవెల్లువలో కార్యక్రమంలో నమోదైన ప్రతి రైతుకు పీఎం కిసాన్ కార్డు ద్వారా రుణాలు ఇప్పించాలని సిబ్బందికి ఆదేశాలిచ్చారు. పాడి రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో సత్తెనపల్లి ఆర్డీవో రాజకుమారి, తహసీల్దార్ ఎం.భవానీశంకర్ పాల్గొన్నారు.

ఓటర్ల జాబితా సవరణ పకడ్బందీగా చేపట్టాలి

సత్తెనపల్లి: రానున్న సాధారణ ఎన్నికల్ని దృష్టిలో పెట్టుకొని ప్రత్యేక ఓటర్లను సవరణ కార్యక్రమాన్ని పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా జాయింట్ కలెక్టర్ ఏ. శ్యాంప్రసాద్ అధికారుల్ని ఆదేశించారు. రాష్ట్ర వ్యాప్తంగా సమగ్ర ఓటర్ సర్వే షెడ్యూల్ కార్యక్రమం ప్రారంభంలో భాగంగా పల్నాడు జిల్లా సత్తెనపల్లిలోని పోలింగ్ బూత్ నంబర్-40లో సర్వే ప్రక్రియను ఆయన క్షేత్రస్థాయిలో శుక్రవారం పరిశీలించి, సూచనలు చేశారు. ఓటరు జాబితాలో మార్పులు, చేర్పులకు సంబంధించి ఫారం -6,7,8,8ఏలకు వచ్చిన దరఖాస్తుల్ని పెండింగ్ లేకుండా సత్వరమే విచారించి అర్హుల్ని జాబితాలో నమోదు చేయాలని ఆదేశించారు. ఆగస్టు 21 వరకు బీఎల్వోలు ఇంటింటి ఓటర్ జాబితా పరిశీలన సమగ్రంగా చేపట్టాలని చెప్పారు. అక్టోబర్ 28, 29, నవంబర్ 18,19 తేదీల్లో పోలింగ్ కేంద్రాల్లో ప్రత్యేక ఓటర్ నమోదును బీఎల్వోలు సమర్థంగా నిర్వహించాలని, దాన్ని ఈఆర్వోలు పర్యవేక్షించాలని జేసీ స్పష్టం చేశారు. 2024 జనవరి 5వ తేదీ నాటికి ఓటర్ల తుది జాబితాను ప్రచురించాలని ఆదేశించారు.

ఒకే ఇంటి నంబర్‌లో ఎక్కువ ఓటర్లు నమోదై ఉంటే వారికి ముందుగా నోటీసులు జారీ చేసి తొలగించాలని ఆదేశించారు. కార్యక్రమంలో సత్తెనపల్లి ఆర్డీవో బి.ఎల్.ఎస్. రాజకుమారి, సత్తెనపల్లి తహసీల్దార్ ఎస్. సురేష్, ఎంపీడీవో జి.వి.సత్యనారాయణ, రెవిన్యూ, మున్సిపల్ అధికారులు, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

ఓటర్ల జాబితాలపై ఇంటింట సర్వే ప్రారంభం

ముప్పాళ్ల: మండలంలోని అన్ని గ్రామాల్లోనూ ఎన్నికల కమిషన్ ఆదేశాల మేర ఓటర్ల జాబితాలపై ఇంటింట సర్వే ప్రక్రియ ప్రారంభమైనట్లు తహసీల్దార్ ఎం.భవానీశంకర్ శుక్రవారం చెప్పారు. నెల రోజుల పాటు ఈ కార్యక్రమం నిర్వహిస్తామని ఆయన పేర్కొన్నారు. అన్ని గ్రామాల్లోని బీఎల్ఓలు ఈ సర్వేలో పాల్గొన్నారని తెలిపారు. ముప్పాళ్ల, చాగంటివారిపాలెం గ్రామాల్లో సర్వేను క్షేత్రస్థాయిలో ఆయన పరిశీలించారు.

నేడు రెండు గ్రామాల్లో 'జగనన్న సురక్ష'

రాజుపాలెం: మండలంలోని రాజుపాలెం, ఇనిమెట్ల గ్రామాల్లో శనివారం జగనన్న సురక్ష కార్యక్రమాల్ని నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో టి.శ్రీనివాసరావు తెలిపారు. గ్రామస్తులంతా ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని ఆయన సూచించారు. వలంటీర్లు, గ్రామ సచివాలయ సిబ్బంది, ప్రజా ప్రతినిధులు తప్పక హాజరుకావాలని ఆయన కోరారు.

తూనికలు, కొలతల్లో తేడాలొస్తే చర్యలు

క్రోసూరు: పల్నాడు జిల్లా లీగల్ మెట్రాలజీ విభాగం అసిస్టెంట్ కంట్రోలర్ అల్లూరయ్య, సత్తెనపల్లి ఇన్‌స్పెక్టర్ షేక్ జాన్‌సైదా గురు, శుక్రవారాల్లో అచ్చంపేట, క్రోసూరు వ్యాపారులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా అల్లూరయ్య మాట్లాడుతూ నిత్యావసర సరుకులు ధరల పట్టిక విక్రయదారులకు కనబడే విధంగా పెట్టాలని చెప్పారు. తూనికల్లో తేడాలు లేకుండా చూసుకోవాలని తెలిపారు. తనిఖీల్లో తేడాలున్నట్లు గుర్తిస్తే జరిమానాతో పాటు చట్టపరమైన చర్యలుంటాయని హెచ్చరించారు.

గ్రామసేవకుల్లో అర్హులకు ప్రమోషన్లు కల్పించాలి

నకరికల్లు: గ్రామసేవకుల్లో అర్హులైన వారికి ప్రమోషన్లు కల్పించాలని సంఘం మండల అధ్యక్షుడు షేక్ సైదా ప్రభుత్వాన్ని కోరారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద ఏపీ గ్రామ రెవెన్యూ సహాయకుల సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం రెండో రోజు దీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తమ న్యాయమైన డిమాండ్లను పరిష్కరించని పక్షంలో ఆగస్ట్ 7, 8తేదీల్లో కలెక్టరేట్ల వద్ద దీక్షలు చేపడతామని తెలిపారు. అదే నెల 23,24వ తేదీల్లో విజయవాడలో రాష్ట్రస్థాయి దీక్షలు చేపట్టి 25న జగనన్నకు చెబుదాం కార్యక్రమం చేపడతామని పేర్కొన్నారు. ప్రభుత్వం సానుకూలంగా స్పందించి తమ డిమాండ్లను పరిష్కరించాలని ఆయన కోరారు. కార్యక్రమంలో కార్యదర్శి ఇనుముక్కల యాకోబు, కొత్తపల్లి సీతయ్య, కనకయ్య, కోటేశ్వరరావు, ఇనుముక్కల కోటయ్య, చిన కోటేశ్వరరావు, ఆదంసాహెబ్, మరియమ్మ పాల్గొన్నారు.

అంకితభావంతో పనిచేస్తే ప్రజల నుంచి మంచి గుర్తింపు



బదిలీపై వెళ్తున్న ఎస్ఐ పి.సురేష్‌ను సన్మానిస్తున్న డీఎస్పీ, సీఐ, సిబ్బంది

నకరికల్లు: అంకితభావంతో పనిచేసే వారికి ఎక్కడ ఉద్యోగం చేసినా ప్రజల నుంచి మంచి గుర్తింపు వస్తుందని సత్తెనపల్లి డీఎస్పీ బి.ఆదినారాయణ అన్నారు. నకరికల్లు నుంచి యడ్లపాడుకు బదిలీపై వెళ్తున్న ఎస్ఐ పి.సురేష్, లాంగ్ స్టాండింగ్‌తో బదిలీపై వెళ్తున్న ఏఎస్ఐ ప్రసాద్, హెడ్ కానిస్టేబుల్ నాయక్, రైటప్ షేక్ సుభాని, కానిస్టేబుల్ ఆజాద్‌లను గురువారం రాత్రి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నకరికల్లులో నేరాల్ని అరికట్టడంలో ఎస్ఐ సురేష్ ప్రణాళికతో పనిచేశారని తెలిపారు. పలుచోరీ, హత్య కేసుల్లో నిందితుల్ని తక్కువ సమయంలో పట్టుకొని ప్రజల్లో ప్రశాంతత నెలకొల్పారని ప్పారు. ప్రజలు, సిబ్బందితో మమేకమై ఎన్నో పెండింగ్ కేసులు పరిష్కరించారని అభినందించారు. సత్తెనపల్లి రూరల్ సీఐ సీహెచ్.కోటేశ్వరరావు మాట్లాడుతూ క్రిందిస్థాయి సిబ్బందితో కలుపుగోలుగా ఉంటూ, అధికారులకు సకాలంలో సమాచారం ఇస్తూ పలు కేసులు ఛేదించడంలో ఎస్ఐ సురేష్ తనదైన మార్కు సాధించారని కొనియాడారు. అనంతరం పూలమాలలు, దుశ్శాలువాలతో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ఏఎస్ఐలు కోటేశ్వరరావు, ప్రసాద్, జిలాని, వెంకటేశ్వర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

ఈ-పంట నమోదు తప్పనిసరి



విత్తనాల దుకాణాన్ని తనిఖీ చేస్తున్న ఏడీఏ, ఏవో

బెల్లంకొండ: గ్రామాల్లో రైతులు తప్పనిసరిగా ఈ-పంట నమోదు చేసుకోవాలని, ఈ దిశగా సిబ్బంది వారికి అవగాహన కల్పించాలని వ్యవసాయ శాఖ క్రోసూరు డివిజన్ ఏడీఏ వి.హనుమంతరావు పేర్కొన్నారు. శుక్రవారం మండలంలోని నాగిరెడ్డిపాలెం రైతు భరోసా కేంద్రంలో వివిధ గ్రామాల వ్యవసాయ, రెవెన్యూ శాఖల సిబ్బందికి ఈ-పంట నమోదుపై శిక్షణ ఇచ్చారు. గ్రామాల్లోని అన్ని సర్వే నంబర్లలో సాగు చేస్తున్న వ్యవసాయ, ఉద్యాన పంటల విస్తీర్ణం సహా నమోదు చేయాలని ఆయన సూచించారు. కౌలు రైతులకు సీసీఆర్సీ కార్డులు జారీ చేసి, పంట నమోదు కూడా చేయాలని ఏడీఏ తెలిపారు. అనంతరం మండల కేంద్రంలోని పలు విత్తన, పురుగు మందుల దుకాణాల్ని తనిఖీ చేశారు. నాణ్యమైన విత్తనాలు, పురుగు మందులు విక్రయించాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఏవో డి.కృష్ణయ్య, వివిధ గ్రామాల వ్యవసాయ, రెవిన్యూ శాఖల సిబ్బంది పాల్గొన్నారు.

ఇంటర్ విద్యార్థిని ఆత్మహత్య

నకరికల్లు: భయానక కలలతో మానసిక ఒత్తిడికి లోనై విద్యార్థిని ఆత్మహత్యకు పాల్పడింది. ఈ సంఘటన మండలంలోని గుండ్లపల్లిలో శుక్రవారం జరిగింది. సంఘటనకు సంబంధించి వివరాలు ఇలా ఉన్నాయి. గ్రామానికి చెందిన కొత్తపల్లి నాగేశ్వరరావు, వాణిల కుమార్తె దివ్యభారతి (16). నలుగురు పిల్లల్లో ఆమె మొదటి సంతానం. తండ్రి గతంలోనే మృతి చెందాడు. స్థానిక కస్తూరిబా పాఠశాలలో దివ్యభారతి(16) ఇంటర్ మొదటి సంవత్సరం చదువుతోంది. కాగా రాత్రి పూట భయానకమైన కలలు వస్తున్నాయని కుటుంబసభ్యులకు తరచూ తెలిపేది. ఈ నేపథ్యంలో ఈనెల 12న బాబాయి హాస్టల్‌కు వచ్చి ఇంటికి తీసుకెళ్లాడు. అదేరోజు మజ్జిగలో ఎలుకల మందు కలుపుకొని తాగి ఎవరికీ తెలియజేయలేదు. 20న విషయం గుర్తించిన కుటుంబసభ్యులు నరసరావుపేటలోని ప్రైవేటు హాస్పిటల్‌లో చేర్చారు. చికిత్సపొందుతూ శుక్రవారం మృతి చెందింది. ఘటనపై ఎస్ఐ ఏ.బాలకృష్ణ మాట్లాడుతూ మృతురాలు ఇచ్చిన వాఙ్మూలంలో తనకు నిద్రలో భయానక కలలు వస్తున్నాయని, చనిపోయి తమ వద్దకు రమ్మని పిలుస్తున్నాయని, దీంతో భయపడి ఎలుకలు మందు తాగినట్లు తెలిపిందని పేర్కొన్నారు. ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు.

సీసీఆర్సీ కార్డులతో కౌలు రైతులకు ఎంతో ప్రయోజనం



మహిళా రైతులతో రీజనల్ కో-ఆర్డినేటర్ చిన్నప్ప, వెంకటరమణ తదితరులు

సత్తెనపల్లి: కౌలు రైతులంతా సీసీఆర్సీ కార్డుల ద్వారా ప్రయోజనం పొందాలని డీబీఆర్సీ పల్నాడు జిల్లా రీజినల్ కో-ఆర్డినేటర్ మల్లెల చిన్నప్ప సూచించారు. దళిత బహుజన రిసోర్స్ సెంటర్ ఆధ్వర్యంలో రైతులు, కౌలు రైతులు, మహిళా రైతులకు శుక్రవారం రెంటపాళ్ల కమ్యూనిటీ హాలులో సుస్థిర వ్యవసాయంపై అవగాహన సదస్సును నిర్వహించారు. సదస్సుకు డీబీఆర్సీ ఏరియా కో-ఆర్డినేటర్ మేడే వెంకటరమణ అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన మల్లెల చిన్నప్ప మాట్లాడుతూ చిన్న, సన్న కారు రైతులంతా ప్రకృతి, సేంద్రియ వ్యవసాయం వైపు మనసు పెట్టాలని, అపరాలు పంటలు వేయాలని సూచించారు. ఎస్సీ, ఎస్టీ రైతులు, కౌలు రైతులంతా సీసీఆర్సీ కార్డులు తీసుకోవడం వల్ల ప్రభుత్వం అందిస్తున్న రైతు భరోసా, బ్యాంక్ రుణాలు, ఇన్‌పుట్ సబ్సిడీ, సబ్సిడీపై ఎరువులు, పురుగు మందులు పొందేందుకు అవకాశం ఉంటుందని తెలిపారు. డీఆర్పీ నీరజ మాట్లాడుతూ పసుపు, కారం పొడులు, విస్తరాకులు, కొవ్వొత్తుల తయారీకి గానూ ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్ ద్వారా రూ. లక్ష వరకు లోన్ ఇప్పిస్తామని తెలిపారు. చిన్న, చిన్న వ్యాపారాలు చేసుకునే వారికి అవకాశం కల్పిస్తామని పేర్కొన్నారు. వీవో ఏ.ప్రసన్న మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో ఖాళీగా ఉన్న యువతకి యూనియన్ బ్యాంక్ ఆధ్వర్యంలో హాస్టల్, భోజన వసతితో ఉచితంగా కంప్యూటర్ అండ్ టైలరింగ్ కోర్సుల్లో శిక్షణ ఇస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో కౌలు రైతులు పాల్గొన్నారు.

ఘనంగా చర్చి ప్రథమ వార్షికోత్సవం



ఎర్రబాలెం(క్రోసూరు): మండలంలోని ఎర్రబాలెంలో ఏఈఎల్‌సీ చర్చి ప్రథమ వార్షికోత్సవాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన ఆరాధన పండుగకు ఎమ్మెల్యే నంబూరు శంకరరావు సతీమణి వసంతకుమారి హాజరయ్యారు. బిషప్ ఏలియా, పాస్టర్ కాంతారావు పాల్గొని ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు.కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు వెలది అప్పారావు, గల్లా గురుపాదం, ఎంపీపీ పి.కోటయ్య, గార్లపాటి దాసు, అనుముల కోటిరెడ్డి, రామాంజనేయులు పాల్గొన్నారు.